క్లుప్తంగా

ఎమ్మెల్సీ తోటను కలసిన శ్రీకాంత్



మండపేటలో ఎమ్మెల్సీ తోటకు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీకాంత్

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ తోట పార్టీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన నేపథ్యంలో ఆయకు శ్రీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పార్టీ మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేద్దామన్నారు. ఎమ్మెల్సీ తోటను కలసిన వారిలో అమలాపురానికి చెందిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, తదితరులున్నారు.

ముగిసిన పోలేరమ్మ జాతర

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిద గ్రామ దేవత పోలేరమ్మ జాతర సోమవారంతో ముగిసింది. మూడు రోజుల పాటు నిర్వహించిన జాతర వైభవంగా సాగింది. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గరగ నృత్యాలు డప్పు వాయిద్యాలతో ఆలయం సందడిగా మారింది. సోమవారం అమ్మవారిని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దర్శించుకున్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



అమలాపురంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కామన

కపిలేశ్వరపురం (మండపేట): ప్రభుత్వమే బాధ్యత తీసుకొని రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు ఏపీ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు వినతిపత్రాన్ని అందజేశారు. అమలాపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో రైతు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు కామన తెలిపారు. జిల్లాలో ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొంటానని చెప్పడం హాస్యాస్పదమని కామన అన్నారు.


బీసీల అభ్యున్నతికి పాటు పడాలి



మండపేటలో శ్రీనుకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): బీసీ సామాజిక వర్గీయుల అభ్యున్నతికి పాటు పడాలని ఇటీవల వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన పాలిక శ్రీనుకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పాలిక శ్రీను తదితరులు ఎమ్మెల్సీ తోటను కలిశారు. పాలిక శ్రీనును పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ తదితరులు అభినందించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ నియోజకవర్గంలోని బీసీ సామాజిక వర్గీయుల ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులను మెరుగుపర్చే దిశగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో చిక్కాల శ్రీరాములు, వాసంశెట్టి రాధాకృష్ణ, పెంకే గంగాధర్, మండపల్లి రవికుమార్, జొన్నపల్లి సత్తిబాబు, యరమాటి వెంకన్నబాబు, సూరంపూడి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్స్ జిల్లా అధ్యక్షుడిగా తాతరాజు



విజయవాడలో తాతరాజును సత్కరిస్తున్న నియోజకవర్గ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండపేట పట్టణానికి చెందిన సుమేథ విద్యానికేతన్ పాఠశాల అధినేత గుండు తాతరాజు నియమితులయ్యారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నియామకాన్ని ప్రకటించారు. సమావేశానికి హాజరైన మండపేట సమీప ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు వంకా రంబాబు, కామిరెడ్డి గాంధీ, నెక్కంటి బుచ్చిరామారావు, ఎంఎస్ఎన్ బాబు, నాగేంద్ర ప్రసాద్, సీతారం దత్తు పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమూ, ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వేసవిలో సరఫరాలో సమస్యలకు అవకాశం
- అధికారుల సూచనలు పాటించాలి
- సొంత ప్రయత్నాలు ప్రమాదకరం

కపిలేశ్వరపురం: విద్యుత్ చీకటిని చీల్చే వెలుతురు. విద్యుత్‌శక్తి యావత్ మానవాళికీ వెలుగును పంచుతోంది. దాని వెలుగు వెనుక చీకటి కోణాలు సైతం ప్రమాదాల రూపంలో వెంటాడుతున్నాయి. వేసవిలో విద్యుత్ వినియోగం అంచనాలకు మించి ఉంటోంది. ఒత్తిడి నేపథ్యంలో సరఫరాలో సమస్యలు సైతం తలెత్తుతుంటాయి. గృహ, వ్యాపార, వ్యవసాయ, పశువుల పాకల్లోని విద్యుత్ లైన్ల పట్ల అవగాహనతో మసలుకోకపోతే ప్రాణపాయమయ్యే ప్రమాదం ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్లతో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు సైతం ఉన్నాయి.

ప్రాణాలు తోడేస్తున్న ప్రమాదాలు

ఈ ఏడాది మార్చి 2న మండపేట పట్టణానికి చెందిన ఎలక్ట్రికల్ కార్మికుడు తణుకు దుర్గబాబు (38) ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధి వేములపల్లిలో ఫిబ్రవరి 15న లారీ ట్యాంకర్‌ను శుభ్రం చేసేందుకు పైకి ఎక్కగా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఐ.పంగిడికి చెందిన లారీ డ్రైవర్ చిటికెన రామకృష్ణ (52) విద్యుత్ వైరు తగిలి మృతి చెందాడు. 2023లో కాజులూరు మండలం బంధనపూడి శివారు మొగలిపాలెంలో కె.సుబ్బారావు (88) ఈదురుగాలులకు నేలరాలిన కొబ్బరి కాయలు, ఆకులను సేకరిస్తుండగా తెగిపడిన విద్యుత్ వైరు తగిలి చనిపోయారు. కపిలేశ్వరపురం మండలం తాతపూడిలో కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు జరుగుతుండగా విద్యుత్ వైరు తగిలి మేస్త్రి మృతి చెందాడు. 2021 డిసెంబర్ 13న కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురానికి చెందిన వ్యవసాయ కూలి కొమ్మరి సత్యనారాయణ (53) చేతిపంపునకు విద్యుత్ ప్రవహించడంతో మృతి చెందాడు.

రెండు నియోజకవర్గాల్లో విద్యుత్ కనెక్షన్లు ఇలా...

సెక్షన్	కేటగిరి 01	కేటగిరి 02	కేటగిరి 03	కేటగిరి 04	కేటగిరి 05	మొత్తం
ఆర్సీ పురం టౌన్	19,105	2,758	90	531	438	22,922
ఆర్సీపురం రూరల్	18,059	2,067	60	567	704	21,457
కె.గంగవరం	17,598	1,437	33	681	448	20,197
కపిలేశ్వరపురం	20,011	1,391	39	588	936	22,965
మండపేట	22,166	4,143	82	308	171	26,870
ఏడిద	7,030	646	38	146	741	8,601
ద్వారపూడి	18,204	2,067	116	413	797	21,597
రాయవరం	21,707	1,917	84	551	868	25,127
మొత్తం	1,43,880	16,426	542	3,785	5,103	1,69,736



అంగరలో విద్యుత్ స్తంభంపై లైటు అమరుస్తున్న కార్మికుడు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా...

- ఓల్టేజీలో హెచ్చు తగ్గులు ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. సొంత ప్రయత్నాలు చేయకూడదు.
- విద్యుత్ వైర్లను తాకుతూ ఎలాంటి వస్తువులను చేర్చకూడదు.
- విద్యుత్ వైర్లను ఇతర వైర్లతో కలపనీయరాదు. సపోర్ట్ వైర్లుగా ఇన్సులేటెడ్ వైర్లను ఉపయోగించాలి.
- చెట్టు కొమ్మలు వైర్లను కానీ, స్తంభాలను కానీ తాకుతుంటే ముందస్తుగా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించాలి. తెగిపడిన వైర్లను తాకకుండా జాగ్రత్తపడాలి.
- ఎవరికైనా విద్యుత్ షాక్ తగిలితే రక్షించాలన్న ఆతృతతో తాకరాదు. ముందస్తుగా బాధితుడిని తాకిన వైరును తొలగించే చర్యలు చేపట్టాలి.
- తడిచేతులు, తడికాళ్లతో విద్యుత్ ఉపకరణాలను తాకరాదు.

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఎస్ఎంయూ నాయకులు, కార్మికులు

రామచంద్రపురం: ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక డిపో వద్ద యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో రిలే దీక్షలను చేపట్టారు. రెండు రోజుల రిలే నిరాహార దీక్షలో భాగంగా సోమవారం రామచంద్రపురం డిపో వద్ద నిరాహార దీక్ష శిబిరాన్ని రీజినల్ ప్రెసిడెంట్, డిపో సెక్రటరీ బండి ముత్యాలరావు ప్రారంభించారు. ఆధ్వర్యంలో దీక్షలో కూర్చున్న వారికి రీజినల్ కమిటీ మెంబర్ శెట్టి మూర్తి పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్లను అక్రమ రిమూవల్స్‌ను వెంటనే ఆపాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్లతో రెండు రోజులు రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నట్లు వారు వెల్లడించారు. ఎస్ఎంయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో చేతులెత్తేసిన కూటమి

- బయట అమ్ముకోమంటున్న అధికారులు
- దళారుల ప్రభావంతో ఎకరాకు రూ.15 వేల నష్టం
- ఎమ్మెల్సీ తోట



మండపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): ధాన్యం కొనుగోలులో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని, తమ కేంద్రానికి నిర్దేశించిన లక్ష్యం పూర్తయిందంటూ రైతులను వెనక్కి పంపేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎద్దేవా చేశారు. మండపేటలో సోమవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనా తీరును ఎండగట్టారు. జిల్లాలో ఆరు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా తొలుత 80 వేల మెట్రిక్ టన్నులు, మలివిడతలో లక్షా 40 వేల మెట్రిక్ టన్నులను మాత్రమే కొనుగోలు చేయనున్నట్టు అధికారులు తెలిపారన్నారు. రైతు ధాన్యాన్ని ప్రభుత్వం కాకపోతే మరెవరు కొంటారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గింజను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొన్న సంగతిని గుర్తు చేశారు. మండపేట మండలం కేశవరంలో జిల్లా కలెక్టర్, కూటమి ప్రభుత్వ నాయకులు ఆర్భాటంగా ధాన్యం సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారని, కొద్ది రోజులకే కొనుగోలు లక్ష్యం పూర్తయిందని చెప్పడం దారుణమన్నారు. మండపేట పరిసర ప్రాంతంలోనే ఈ సమస్య తలెత్తుతుండటం ఈ పాలకుల ప్రత్యేకత అన్నారు. వాతావరణం అనుకూలించడమూ, దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో రైతులు ధాన్యాన్ని అమ్మేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. గిట్టుబాటు ధర రూ.1730 కాగా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులకు రూ.1500కు అమ్ముకొంటున్నారన్నారు. దళారుల ప్రభావంతో బస్తాకు రూ.300 చొప్పున ఎకరా దిగుబడికి రూ.15 వేలు రైతు కుటుంబం నష్టపోతోందన్నారు. రైతుకు మిగిలేదంతా దళారులు పాలవుతోందన్నారు. బొండాలు రకం ధాన్యం కొనుగోలు ప్రక్రియను నేటి వరకూ ప్రారంభించకపోవడం దారుణమన్నారు. మాటలను నమ్మి అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని పది నెలల పాలనా కాలంలోనే తేలిపోయిందన్నారు. జిల్లాలో లిక్కరు జనావాసాల మధ్య ఏరులై పారుతోందన్నారు. సమస్యలెదుర్కొంటున్న అన్ని వర్గాల ప్రజల వెంట తాము పోరాడతామని త్రిమూర్తులు భరోసా ఇచ్చారు.

పుస్తక పఠనంతో సామాజిక అవగాహన



కాజులూరు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



కపిలేశ్వరపురంలో చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతున్న చిట్టూరి

కాజులూరు: పుస్తక పఠనం ద్వారా సామాజిక అంశాలపై అవగాహన పెరుగుతుందని స్థానిక నాయకుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి అన్నారు. సోమవారం కాజులూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. స్థానిక గ్రంథాలయాధికారి కేఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ సోమవారం నుంచి జూన్ ఆరో తేదీ వరకూ 40 రోజుల పాటు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుందన్నారు. వేసవి సెలవుల్లో స్థానిక విద్యార్థులకు పుస్తక పఠనం, పురాణ కథలు విశిష్టతలను వివరించడంతో పాటు, చిత్రలేఖనం, పేపర్‌ఆర్ట్స్ వంటి సృజనాత్మకతపైనా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పరిసర గ్రామాల పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సలాది బుల్లియ్య, పులిపి అన్నవరం, సీహెచ్ శ్రీనివాస్, మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్వీ సత్యనారాయణ, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో..

కపిలేశ్వరపురం: గ్రామాల్లో గ్రంథాలయాల పునర్వికాశం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని వేసవి శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి పర్యవేక్షణలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చిట్టూరి సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయుడు హేమచంద్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.సతీష్, ఉపాధ్యాయులు మధుమిత, సత్యవేణి మాట్లాడుతూ సెలవులను సామాజిక అంశాలపై అవగాహన చేసుకొనేందుకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందుకు గ్రంథాలయ సంస్థ ఏటా నిర్వహించే వేసవి శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరగతులు జూన్ 6 వరకూ కొనసాగుతాయని గ్రంథాలయాధికారి శివకుమారి తెలిపారు.

మహనీయురాలు డొక్కా సీతమ్మ



మండపేటలో సీతమ్మ కృషిపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): అన్నపూర్ణగా పేరుగాంచిన డొక్కా సీతమ్మ గొప్ప మహనీయురాలని, ఆమె మండపేట పట్టణానికి చెందినవారు కావడం ఇక్కడి ప్రజల అదృష్టమని ఆమె వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండపేట పట్టణంలోని బురుగుంట చెరువు పార్కు వద్ద డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. క్లబ్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ మాట్లాడుతూ సొంత ఆస్తి పోగుచేసుకోవడమనే ఆలోచన లేకుండా సుమారు 40 ఏళ్లు పైగా ఆనాటి పేదలు, బాటసారులకు అన్నం పెట్టిన మానవతామూర్తి అన్నారు. ఆమె సేవలను ప్రశంసిస్తూ ఆ నాటి ప్రభుత్వం గోదావరి నదీపాయపై నిర్మించిన బ్రిడ్జికి డొక్కా సీతమ్మ ఆక్విడెక్ట్‌గా నామకరణం చేశారన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు రెడ్డిరాజు, సీహెచ్ భాస్కరరాజు, వంకా విశ్వనాథం, గంపల సత్యప్రసాద్, గనిశెట్టి శ్రీనివాస్, దంటు శ్రీనివాస్, పి.వినోద్‌కుమార్, కమల్ కిరణ్, శ్రీను, మంగరాజు పాల్గొన్నారు.

సీతమ్మ జీవితం ఆదర్శప్రాయం

కపిలేశ్వరపురం: డొక్కా సీతమ్మ జీవితం యావత్ భారత ప్రజలకు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆమె వర్ధంతిని విజయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బురుగుంట చెరువు పార్క్ వద్ద నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకులు బి.విజయ్‌మోహన్, ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌లు సీతమ్మ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో అవసరాల వీర్రాజు, జొన్నపల్లి సూర్యారావు, ముత్యాల పద్మ పాల్గొన్నారు.

భీమేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే శ్రీధర్



భీమేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుటుంబ సభ్యులు

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ కడప జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కుటుంబ సమేతంగా ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం నంది మండపంలో వారికి వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

నేడు వెల్ల కామెర్ల వైద్య నిలయం శతాబ్ది ఉత్సవం

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాల్లో కూడా ప్రసిద్ధి చెందిన వెల్ల కామెర్ల మందు అందించే గుండుబోగుల సూర్యారావు కామెర్ల వైద్య నిలయం స్థాపించి (1920) వంద సంవత్సరాలు దాటిన సందర్భాన్ని పురస్కరించుకుని నేటి సాయంత్రం 4 గంటలకు వెల్ల గ్రామంలో శతాబ్ది ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం విలేకరులకు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన జరగనున్న కార్యక్రమానికి కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, గంటి హరీష్‌మాధుర్, సానా సతీష్, తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. సంస్థ వెబ్‌సైట్ లాంచ్, ఎన్‌జీఓ లాంచ్, డిజిటల్ లాంచ్, సాంస్కృతిక కార్యక్రమాలు, సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విషాద ఘటనకు రాజకీయ రంగు పులమడం సరైంది కాదు

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల మండపేట పట్టణం కేపీ రోడ్డులో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో మృతి చెందిన వ్యక్తి కుటుంబాన్ని మానవత్వంతో ఆదుకొనేందుకు మనస్సు రాకపోవడం దారుణమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఘటనలో మృతి చెందిన మాదాబత్తుల సత్తిబాబుది సాధారణ కుటుంబమని, ఇద్దరు పిల్లలు అన్యాయమైపోయారన్న కొద్దిపాటి ఆలోచన కూడా లేకుండా కొందరు నాయకులు, పోలీసు అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. సత్తిబాబును ద్విచక్రవాహనంతో ఢీకొట్టిన చుండ్రు సుమన్ చౌదరి గంజాయి సేవిస్తాడని, డ్రగ్స్ తీసుకొంటాడని అనేక మంది చెబుతున్నప్పటికీ ప్రమాద ఘటనపై చట్ట పరిధిలో చర్యలు తీసుకోవడంలో పోలీసులు సరైన రీతిలో వ్యవహరించడం లేదని ఆరోపించారు. మృతుడు సత్తిబాబు కుటుంబానికి న్యాయం చేయాలని కలువపువ్వు సెంటర్‌లో పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళన చేసినప్పుడు కొందరు పెద్దలు కుటుంబాన్ని ఆదుకొంటామంటూ హామీ ఇచ్చారన్నారు. రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ చట్టపరిధిలో చర్యలు తీసుకోలేదని, కుటుంబానికి న్యాయం చేయలేదన్నారు. సత్తిబాబు కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన ఓ నాయకుడు సత్తిబాబుకు టీడీపీ సభ్యత్వం ఉండి ఉంటే పార్టీ ద్వారా ఇన్సూరెన్స్ సాయం మంజూరై ఉండేదని అన్నారని తెలిసిందన్నారు. విషాద ఘటనకు రాజకీయ రంగు పులమడం ఏపాటి ధర్మమో ఆ నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నానని త్రిమూర్తులు అన్నారు.

ఉగ్రవాదాన్ని తుదముట్టించాలి



గొల్లపాలెంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు



ఉగ్రవాదిని నిరసిస్తూ ఏడిదలో శాంతి ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు

కాజులూరు: ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం ఉక్కుపాదం మోపి తుద ముట్టించాలని రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ కో ఆర్డినేటర్ దూడల శంకరనారాయణమూర్తి అన్నారు. కశ్మీర్ పహల్గామ్ లోయలో పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదుల దుర్మార్గపు చర్యలను ఖండిస్తూ సోమవారం గొల్లపాలెంలో స్థానిక నాయకుడు డాక్టర్ శీలామంతుల వీరభద్రరావు (చిన్నా డాక్టర్) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్టేట్ బ్యాంక్ సెంటర్ నుంచి కాజులూరు జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించి కొవ్వొత్తులతో మృతులకు నివాళులర్పిస్తూ గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిఘా, రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసి మరోమారు ఇటువంటి సంఘటనలను పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సామాజిక సంస్థ బాలవికాస కేంద్రం జిల్లా కార్యదర్శి గుండు విశ్వనాథం, స్థానిక నాయకులు ఓలేటి రాంబాబు, పోతుల కిశోర్, సింగన శ్రీనివాసరావు, అంగర కిరణ్, వినకోట వెంకన్నబాబు పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

కపిలేశ్వరపురం (మండపేట): పెహల్గామ్‌లో ఉగ్రవాద ముష్కరులు జరిపిన దాడిని నిరసిస్తూ మండపేట మండలం ఏడిదలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఉగ్రవాదం నశించాలని, ప్రపంచశాంతి వర్థిల్లాలంటూ నినాదాలు చేస్తూ గ్రామ వీధుల్లో ర్యాలీ చేశారు. పలువురు మాట్లాడుతూ ఉగ్రవాదుల దుశ్చర్యలకు అమాయక ప్రజలు, సైనికులు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పర్వతిన వీర్రాజు, రామిశెట్టి రాజా, పసుమర్తి నాగేశ్వరరావు, గొడవర్తి సత్యనారాయణ, ముగ్గళ్ళ కాశీకృష్ణ, తుంపాల ఆదినారాయణ, కొలుపోటి రాజబాబు, బొక్కా నాగేశ్వరరావు, శెట్టి అనిల్ కుమార్, కామన నాగరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ విద్యార్థులకు అభినందనలు



మండపేట మున్సిపల్ పాఠశాలల విద్యార్థినులను అభినందిస్తున్న చైర్‌పర్సన్ నూకదుర్గారాణి



మండల స్థాయిలో ఉత్తమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సత్కరిస్తున్న ఎంపీపీ వెంకటరమణ తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మెరుగైన మార్కులతో ప్రతిభ కనబర్చిన పట్టణంలోని ఎస్ఎస్‌వీవీ, జవహర్‌లాల్ మున్సిపల్ పాఠశాలల విద్యార్థులను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అభినందించారు. 600 మార్కులకు గానూ 500 మార్కులకు పైబడి సాధించిన విద్యార్థులను సోమవారం తన చాంబర్‌లో ప్రశంసించారు. వై.మోహన వెంకటదుర్గ, పి.బిందు సాయిశ్రీ, షేక్ షబీనా, పి.భార్గవి, కేవీవీ సత్యనారాయణ, వి.సత్యహాసిని, బి.పల్లవి, వై.కిరణ్మయి, జి.శర్వానంద్‌లకు శాలువా కప్పి మెడల్స్ అందజేశారు. వారికి విద్యాబుద్ధులు చెప్పిన హెచ్ఎంలు సీహెచ్‌వీవీఎస్ఎన్‌మూర్తి, జి.లత, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.గోపాలకృష్ణారెడ్డి, వి.లక్ష్మీ, కె.మహాలక్ష్మి, వై.వెంకట్రావు పాల్గొన్నారు. మున్సిపల్ పాఠశాలలు మెరుగైన ఫలితాలను సాధించడం ప్రశంసించతగినదని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఎస్ఎస్‌వీవీ, జవహర్‌లాల్ మున్సిపల్ పాఠశాలల విద్యార్థులను తన క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. అభినందించినవారిలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఉంగరాల రాంబాబు ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

రాయవరం: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆ దిశగా కష్టపడాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో పదో తరగతిలో మండల స్థాయిలో మెరిట్ విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఎంపీడీవో కీర్తి స్పందన అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ కష్టాన్ని ఇష్టంగా మార్చుకుంటే లక్ష్యం ఎంత పెద్దదైనా చిన్నదిగానే మారుతుందన్నారు. సమావేశంలో రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాల్లో ముందంజలో ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టణ ప్రాంత విద్యార్థులతో పోటీ పడుతున్నారన్నారు. మాచవరం జెడ్పీ పాఠశాల విద్యార్థిని జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. అనంతరం పది ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పి.వెంకటలక్ష్మీ రమ్య నందు, బి.వెంకట భాస్కర శ్రీరామ్, వీవీ వసుంధరలను దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు, స్థానిక నేతలు వుండవిల్లి రాంబాబు, వెలగల ఫణికృష్ణారెడ్డి, పాఠశాల హెచ్ఎంలు వీఎస్ సునీత, సుబ్రహ్మణ్యం, ఎంఈవో వై.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



రామచంద్రపురంలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

రామచంద్రపురం: రామచంద్రపురం డివిజన్లో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో డివిజన్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత పాఠశాలలో సోమవారం అభినందన సత్కారం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి పి.రామలక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డివిజన్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన పసుపులేటి వెంకటలక్ష్మి రమ్య (589/600) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాచవరం, వెలగల లలిత అభినవ చంద్రహాస (589/600)మున్సిపల్ ఉన్నత పాఠశాల పిల్లావారి వీధి, రామచంద్రపురం, బోనం వెంకట భాస్కర శ్రీరామ్(588/600) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాచవరం విద్యార్థులకు శాలువాలు కప్పి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎంఈఓ-1 వీరరాఘవరెడ్డి, ఎంఈఓ-2 నాగేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.